క్లుప్తంగా

ప్రజాప్రతినిధులతో ఆర్డీఓ సమావేశం


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

ఆత్మకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులతో ఆర్డీఓ నాగజ్యోతి సమావేశమయ్యారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఓటర్ల నమోదు తదితర అంశాలపై చర్చించారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలని ఆర్డీఓ కోరారు. సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ రమణమ్మ, సీనియర్ అసిస్టెంట్ రమణ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్ రెడ్డి, సీపీఎం నాయకులు రణధీర్, రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లి పాలే శ్రేష్టం


తల్లి పాల వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీఓ కోటీశ్వరి

ఆత్మకూరురూరల్: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రు పాలు పట్టించడం శ్రేష్టకరమని సీడీపీఓ కోటీశ్వరి సూచించారు. పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్లలో బుధవారం జరిగిన తల్లి పాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు కోమలి, జయలక్ష్మి, రమాదేవి, వర్కర్లు లక్ష్మీదేవి, చంద్రకళ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన


నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై రంగారెడ్డి జిల్లాకు చెందిన సుమేధ జ్యోషి వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. వినాయకకౌత్వం, శివాష్టకం, శివపార్వతికల్యాణం, నమశ్శివాయతే, శివతాండవం, భోశంభో తదితర గీతాలకు శ్రీవిద్య, మేదస్వి, దీక్షిత, కుశాల, స్పందన, రక్ష, గీతిక, పూజిత, గ్రీష్మ, సుమేధ, సహస్ర, నిధి, అద్రితి, స్నిగ్ధ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురావాలి


ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీఈఓ చంద్రశేఖర్

పాములపాడు: ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బందిచే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు మ్యాపింగ్ చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ సులోచన ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


మనగ్రోమోర్ సెంటర్‌లో రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఏఓ

కొత్తపల్లి: ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసాబేగం దుకాణదారులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని మనగ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, స్టాక్ పాయింట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎరువుల దుకాణాదారులు రైతులకు అవసరంలేని ఎరువులను అంటగట్టరాదన్నారు. అనుమతులు లేని, కాలంచెల్లిన, ఎరువులు, రసాయనిక మందులు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

మహానందీశ్వరుడిని దర్శించుకున్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్

మహానంది: ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగ్గారాజు బుధవారం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. అనంతరం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు.

‘చెత్త’శుద్ధి ఏదీ?


గ్రామాల్లో చెత్తను సేకరిస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు

- ఉత్పత్తి కాని చెత్త సంపద
- గ్రీన్‌అంబాసిడర్లకు అందని వేతనాలు
- పంచాయతీల్లో సన్నగిల్లుతున్న ఆదాయ వనరులు

పంచాయతీలకు మంజూరు చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను కూటమి ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించడంతో సర్పంచులు లబోదిబోమంటున్నారు. ఇటు ఆదాయ వనరుల్లేక.. అటు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవటంతో తమ పరిధిలోని పంచాయతీలను ఎలా అభివృద్ధి చేయాలో తెలియక సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. చెత్త నుంచి సంపద తయారు చేయాల్సిన అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతో పంచాయతీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. – జూపాడుబంగ్లా

నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూ రు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో 77 పంచాయతీలున్నాయి. ఆరు మండలాల్లో 91,652 కుటుంబాలుండగా 2,72,091 మంది జనాభా ఉన్నారు. అధికారుల లెక్కల ప్రకారం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 540 మంది గ్రీన్‌అంబాసిడర్లు విధులు నిర్వహించాల్సి ఉండగా వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవటంతో ప్రస్తుతం 230 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తూ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

ఉత్పత్తి కాని సంపద

గ్రీన్‌అంబాసిడర్లు గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను సమీపంలోని డంప్‌యార్డు(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు)లకు తరలించి వర్మీకంపోస్టును తయారు చేయాల్సి ఉంది. ఇప్పటిదాకా ఒక్క పంచాయతీలో కూడా వర్మీకంపోస్టు తయారుచేసి విక్రయించిన దాఖలాల్లేవు. మేజర్ పంచాయతీల్లో చెత్తను డంప్‌యార్డులకు తరలించేందుకు 7 ఏళ్ల క్రితం ట్రాక్టర్లను మంజూరు చేశారు. వాటిని పంచాయతీలు వినియోగించకపోవడంతో నిరుపయోగంగా పడివున్నాయి. కొన్ని గ్రామాల్లో డంప్‌యార్డులు దూరంగా ఉండటంతో సేకరించిన చెత్తాచెదారాన్ని గ్రీన్‌అంబాసిడర్లు రహదారుల వెంట పడేస్తున్నారు.


జూపాడుబంగ్లాలో కేజీ రోడ్డు పక్కనే పడేసిన చెత్త

15వ ఆర్థిక సంఘం నిధులొస్తే వేతనాలిస్తాం



గ్రామపంచాయతీల్లో ప్రస్తుతం జనరల్‌ఫండ్స్ లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఇప్పటిదాకా మంజూరు కాలేదు. నిధులు మంజూరైతే గ్రీన్‌అంబాసిడర్లకు వెంటనే వేతనాలు మంజూరు చేస్తాం. ప్రస్తుతం వారికి వేతనాలు ఇవ్వటానికి గ్రామపంచాయతీల్లో డబ్బుల్లేవు. గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా చేస్తాం.
– పద్మావతి, ఈఓఆర్డీ, జూపాడుబంగ్లా

ఆరు మాసాల నుంచి అందని వేతనాలు

ఇంటింటికి వెళ్లి చెత్తసేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఆరు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. ఒక్కొక్కరికి నెలకు రూ.6వేల చొప్పున పంచాయతీ జనరల్ ఫండ్స్ లేదా 15వ ఆర్థిక సంఘం నిధుల్లోంచి గ్రీన్‌అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. కొంత మందికి ఆరుమాసాలు, మరికొంత మందికి 8 మాసాలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇబ్బందిగా ఉంది



ఊర్లోని చెత్తాచెదారాన్ని సేకరించి గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతున్నాం. ఈ పనికి గానూ నెలకు రూ.6వేల వేతనం ఇస్తారు. అది కూడా నాకు 8 నెలల నుంచి అందడం లేదు. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్లినా మమ్మల్ని పట్టించుకునేవాళ్లు లేరు.
– రమణమ్మ, గ్రీన్ అంబాసిడర్

అప్పు చేస్తున్నాం



ఆరు మాసాల నుంచి వేతనాలు మంజూరు కాకపోవటంతో కుటుంబ జీవనానికి అప్పులు చేస్తున్నాం. అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేయాలి.
– సుశీలమ్మ, గ్రీన్ అంబాసిడర్

వేతనాలు రాకపోయినా కష్టపడ్తున్నాం



నేను జూపాడుబంగ్లాలో గ్రీన్‌అంబాసిడర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. ఇప్పటిదాకా ఆరు మాసాల వేతనాలివ్వలేదు. వేతనాలు మంజూరు చేయకపోటంతో కుటుంబాలు గడవటం లేదు. అప్పులు చేసి కుటుంబాలు నెట్టుకొస్తున్నాం. అధికారులు దయతలచి వేతనాలు ఇవ్వాలి. – భాస్కర్, గ్రీన్ అంబాసిడర్

సాక్షి గణపతికి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, పుష్పార్చన జరిపించారు.

నందీశ్వరస్వామికి పరోక్ష సేవ

ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరు పొందిన నందీశ్వరునికి అర్చకులు పూజలు నిర్వహించారు. 21 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామికి విశేష పూజను జరిపించుకున్నారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని బుధవారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీ సమేత మహానందీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లకు అష్టవిధ మహామంగళహారతులు చేపట్టారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్యకల్యాణం జరిపించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు చౌడేశ్వరిమాత


ధ్వజస్తంభాన్ని నెలకొల్పిన దృశ్యం


నవధాన్యాలతో ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న పురోహితులు

ఆత్మకూరు: పట్టణంలోని చౌడేశ్వరి ఆలయం ఎదుట బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు రెండు రోజులుగా ఆలయంలో నవధాన్యాలతో పూజ లు, యజ్ఞాలు, హోమాలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం భక్తులు అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు.





మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దార సుధీర్ డోన్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడు అర్జున్ అమర్నాథ్‌రెడ్డి, అనన్యల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు డోన్‌కు విచ్చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు పూల బొకేలు అందజేసి స్వాగతం పలికారు.

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూరు: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. 31.2 మి.మీ. వర్షపాతనం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భవనాశి, సుద్ద వాగులు పొంగి ప్రవహించాయి. ఈ నెలలో వాగులు, వంకలు రెండుసార్లు ప్రవహించడంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

30.6 మి.మీల వర్షం

కొత్తపల్లి: మండలంలో మంగళవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. కపిలేశ్వరం, మాదుగుల, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లె, శివపురం గ్రామాల్లో తేలికపాటి వర్షం పడింది. ఎం.లింగాపురం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, బావాపురం, పాలెంచెరువు, బండినాయిని పాలెం, గువ్వలకుంట్ల, జి.వీరాపురం గ్రామాల్లో మోస్తరు వర్షం పడింది. మండల వ్యాప్తంగా 30.6 మి.మీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు బుధవారం తెలిపారు.


పొంగి ప్రవహిస్తున్న భవనాశి వాగు


కొత్తపల్లి సమీపంలో మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపు నీరు

సంక్షిప్తం

పంటలు నమోదు చేయించుకోండి

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం తరిగోపుల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీలోపు మీసేవ కేంద్రాల్లో ప్రీమియం చెల్లించి పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. యూరియా కోసం ఇబ్బందులు పడకుండా పంటలపై నానో యూరియాను పిచికారీ చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ డబ్బు బ్యాంకు ఖాతాల్లో జమకాని రైతులు రైతుసేవా కేంద్రాల వద్దకు వెళ్లి కారణం తెలుసుకుని ఆధారాలు చూపి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

వెలుగోడు: ఎరువుల నిల్వలు, క్రయ, విక్రయాలపై రికార్డులు సక్రమంగా నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారిణి స్వాతి దుకాణదారులకు సూచించారు. పట్టణంలోని సహకార సొసైటీ, జువారీ డీలర్ షాపులను ఆమె బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. ధరలు, నిల్వల వివరాల పట్టికలను ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరత సష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

పాములపాడు: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం యర్రగూడూరు గ్రామంలో పర్యటించారు. ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. సీఐ వెంట ఎస్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

జూపాడుబంగ్లా: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ నాగరాజు, ఎంపీడీఓ గోపికృష్ణ, హౌసింగ్ ఏఈ జ్యోతి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న సిమెంటు, ఇసుక, ఐరన్, బ్యాంకు రుణాల వివరాలను లబ్ధిదారులకు తెలియజేసి, త్వరగా గృహాలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: పట్టణంలోని ధోబీఘాట్లను రజక ఫెడరేషన్ చైర్‌పర్సన్ సావిత్రమ్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్వానంగా ఉన్న ధోబీఘాట్ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆమె వెంట ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, నాయకులు శ్రీనివాసులు, శివకేశవ, రంగన్న, వెంకటస్వామి, శివుడు, జయన్న, నాగరాజు ఉన్నారు.

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలోని ధోబీఘాట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి పరిశీలించారు. శిథిలమైన ధోబీఘాట్లకు మరమ్మత్తులు చేయించటంతోపాటు ధోబీఘాట్లు లేని గ్రామాల్లో నూతన ధోబీఘాట్ల ఏర్పాటుకు కృషిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఆమె వెంట రజకసంక్షేమ సంఘం మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్, ప్రచార కార్యదర్శి నాగభూషణం తదితరులు ఉన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

మహానంది: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌యాదవ్, నాయకుడు వేముల రాముపై దాడి చేసిన టీడీపీ నాయకులను శిక్షించాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గోపవరం పుల్లయ్యయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా రమేష్‌యాదవ్ బీసీ వర్గాలకు అండగా నిలబడి పార్టీకి సేవలు అందిస్తున్నారన్నారు. దాడి ఘటనపై పోలీసులు విచారించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల ఏర్పాటు

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నందికొట్కూరు మండల ఉపాధ్యక్షులుగా సురేష్, అబుబక్కర్, జనరల్ సెక్రటరీలుగా టి.చంద్రశేఖర్ నాయుడు, కాడెం.రంగమౌని, ఎం.మహేష్‌బాబు, సెక్రటరీలుగా రజాక్‌బాషా, కుర్వ మల్లయ్య, ఎస్.షేక్‌షావలి, ఈ.మల్లికార్జున గౌడ్, బి.నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జి.మనోజ్, ఎస్.మాలిక్‌బాషా, ఈ.మాదన్నగౌడ్, వి.మహేష్‌రెడ్డి, పి.మురళి, మొల్ల.జావీద్‌మియా, తెలుగు గంగన్న, టి.నాగరాజు, కె.అయ్యన్న, తెలు గు భూపాల్, బొరెల్లి చక్రవర్తిలను నియమించారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

పాములపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం విమర్శించారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 12 గంటల పని విధానం ఆలోచనను విరమించుకోవాలని, స్కీం వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు శివలక్ష్మమ్మ పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ నందికొట్కూర్ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నందికొట్కూర్ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఏడాది పాలనలో ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడాన్ని ప్రజలకు సుధీర్ వివరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, జిల్లా ప్రచార కార్యదర్శి కోకిల రమణారెడ్డి, కౌన్సిలర్ నాయబ్, నాయకులు ఉపేంద్రారెడ్డి, మాధురి, రాజు, చరణ్, రవి, మహేశ్వరరెడ్డి, నాగరాజు, షఫి, బాబు, హరి, వెంకి, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం అడ్డగోలు హామీలు

ఓట్ల కోసం ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని దార సుధీర్ విమర్శించారు. బుధవారం మిడుతూరు మండలం దేవనూర్, చింతలపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. 14 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పాలనను గాలికొదిలి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రశ్నించే వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, ఎంపీటీసీ నాగేశ్వరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ లోకేష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, నాయకులు శివనాగిరెడ్డి, షరీఫ్, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరెడ్డి, శేషిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


హౌసింగ్ బోర్డు కాలనీలో బాబు మోసాలను వివరిస్తున్న దార సుధీర్

ఆధ్యాత్మిక సంబరం

వెలుగోడు: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ పునఃప్రతిష్టాపనోత్సవాల సందర్భంగా మూడు రోజులుగా పట్టణం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. బుధవారం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతులు ప్రజ్ఞానంద సరస్వతి చేత ఆధ్యాత్మిక ప్రవచన పునః ప్రతిష్ట చేశారు. ప్రాతఃకాల పూజ, క్షీర తర్పణాలు, యంత్రాభిషేకాలు, శిఖర కలశ ప్రతిష్ట, ధ్వజ ప్రతిష్ట, మూర్తి ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్టాపన, బలిదానం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మంగళ హారతి ఇచ్చారు. మధ్యాహ్నం వాసవి కమిటీ ఆధ్వర్యంలో వాసవీ రైస్ మిల్లు వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బింగుమళ్ల శ్యాంసుందర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు భవనాసి మహేష్, మున్సిపల్ కార్పొరేటర్ ఖండే శ్యాంసుందర్ లాల్, జిల్లా మాజీ అధ్యక్షులు సత్యానారాయణ, నెరవాటి రవి, ఎంపీపీ లాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పూజలందుకున్న వాసవీ మాత అమ్మవారు

అధికారులపై రైతుల కన్నెర్ర

- అరకొర యూరియా ఇవ్వడంపై వాగ్వాదం
- పోలీసు బందోబస్త్ మధ్య పంపిణీ

పగిడ్యాల: యూరియా కొరతతో అల్లాడిపోతున్న అన్నదాత బుధవారం వ్యవసాయ అధికారులపై కన్నెర్ర చేశారు. రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వద్ద పోలీసు బందోబస్తు మధ్య చేపట్టిన యూరియా పంపిణీ గందరగోళంగా మారింది. పట్టదారు పాస్‌పుస్తకాల జిరాక్స్‌లను క్యూలో పెట్టి ఆరుబయట ఎండలో గంటల కొద్దీ పడిగాపులు కాసినా.. మూడు బస్తాల కంటే ఎక్కువ ఇవ్వకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మాపురం ప్రాథమిక సహకార సొసైటీ కార్యాలయంలోకి చొరబడడానికి యత్నించిన రైతులను పోలీసులు అడ్డుకున్నారు. పగిడ్యాల సొసైటీ వద్ద కూడా రైతులు యూరియా కోసం గంటల తరబడి నిరీక్షించారు.

నందికొట్కూరు: మిడుతూరు మండలం పీర్‌సాహెబ్‌పేట రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం బుధవారం రైతులు పడిగాపులు కాశారు. మూడు గ్రామాలను కలిపి క్లస్టర్‌ను ఏర్పాటు చేయడంతో రైతులు ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల కోసం రైతులు ఉదయం పెద్ద ఎత్తున రైతు సేవా కేంద్రం వద్దకు తరలిరావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


రైతులను నిలువరిస్తున్న ఏఎస్‌ఐ సుబ్బారావు


పీర్‌సాహెబ్‌పేట రైతు సేవా కేంద్రం వద్ద రోడ్డుపై పడిగాపులు కాస్తున్న రైతులు